www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

బుధవారం
30.09.2026



తెలంగాణలోని కీలక సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో మంగళవారం రేవంత్, ఉత్తమ్ భేటీ అయ్యారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించి త్వరితగతిన అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. పాలమూరురంగారెడ్డి, డిండి, సీతారామసాగర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ క్లియరెన్స్ ఇవ్వాలని కోరారు. కృష్ణా బేసిన్‌లో టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటు, సమ్మక్కసాగర్ అనుమతుల పై కేంద్ర మంత్రికి సమగ్ర వినతిపత్రం అందజేశారు.

కలంజ్యోతి, న్యూ ఢిల్లీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తుమ్మిడిహట్టికి అనుమతులు ఇప్పించండి

మహారాష్ట్రను ఒప్పించాలి

- 152 మీటర్ల ఎత్తుతో గ్రావిటీ నీరు
- ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు కావాలి
- సీడబ్ల్యూసీలో సమ్మక్కసాగర్ క్లియరెన్స్ ఇవ్వాలి
- టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలి

కలంజ్యోతి, ఢిల్లీ (సెప్టెంబర్ 29) :
తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలోని తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మిగతా3లో..





కేటీఆర్‌ను కలిసిన పెద్ది స్వప్న

త్వరలోనే నియోజకవర్గ సమీక్ష: కేటీఆర్

కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 29) : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న మర్యాదపూర్వకంగా కలిశారు. దివంగత నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం అనంతరం ఆమె హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన స్వప్న కుటుంబ యోగక్షేమాలు, పిల్లల చదువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజకవర్గ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై సమగ్రంగా సమీక్ష నిర్వహిస్తామని ఆయన స్వప్నకు వెల్లడించారు.



హద్దు దాటితే.. మహిళలతో కొట్టిస్తాం

- నోరు అదుపులో పెట్టుకోవాలి
- అంతర్గత విభేదాలు తక్షణమే వీడాలి
- కొండా ఫ్యామిలీ జోలికి వస్తే వదిలేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ

కలంజ్యోతి, వరంగల్ (సెప్టెంబర్ 29) : పార్టీ నాయకులైనా, రాజకీయ ప్రత్యర్థులైనా మాట్లాడేటప్పుడు నోరు హద్దుల్లో ఉంచుకోవాలని, అదుపుతప్పి మాట్లాడితే మహిళా కార్యకర్తలతో కొట్టిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత కొండా సురేఖ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శ్రేణుల్లో ఉత్సాహం నింపే లక్ష్యంతో ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు స్థానిక రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. హద్దు దాటితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, ప్రత్యర్థుల దాడులను సమర్థవంతంగా ప్రతిఘటించడానికి తమ మిగతా2లో..

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
బుధవారం 30.09.2026
2
www.kalamjyothi.com

రాజన్న ఆలయానికి కేసీఆర్ మొండిచేయి

- భూ ఆక్రమణలను వెలికితీస్తాం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 29) : వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఏడాదికి రూ.100 కోట్లు మంజూరు చేస్తామని చెప్పి మాజీ సీఎం కేసీఆర్ శఠగోపం పెట్టి రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధిని పట్టించుకోలేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి వందలాది కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణం జగద్గురు ఆది శంకరాచార్యుల మఠం ఆజ్ఞల ప్రకారం, హిందూ ధర్మం ప్రకారం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బాసర సరస్వతి అమ్మవారు, ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి దేవాలయం, భద్రాద్రి రామచంద్రస్వామి ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి గోదావరి పుష్కరాల కోసం రూ.1,000 కోట్ల నిధులు విడుదల చేశారని చెప్పారు. సిరిసిల్ల నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులు ఆక్రమించిన ప్రభుత్వ అసైన్డ్ భూములన్నింటినీ బయటకు తీసి నిరుపేదలకు పంచుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థుల హాస్టళ్లు, గురుకుల పాఠశాలల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని మంత్రి విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ హాస్టళ్లను, గిరిజన సంక్షేమ పాఠశాలలను కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు దీటుగా నిర్వహిస్తూ పేద విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను అందిస్తున్నారని, కాస్మోటిక్, డైట్ చార్జీలను పెంచారని తెలిపారు. తాను గతంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్నప్పుడు సిరిసిల్ల ఎమ్మెల్యేగా కేటీఆర్ తన దృష్టికి తెచ్చిన అనేక సమస్యలను పరిష్కరించానన్నారు. కేటీఆర్, కేసీఆర్, హరీష్ రావులు తామే రాజులం, తామే మంత్రులం, తమకు ఎవరూ ఎదురులేరనే అహంకారంతో వ్యవహరిస్తూ రాష్ట్రంలో ప్రతిపక్షాలు లేకుండా కుట్రలు పన్నారని, కాంగ్రెస్‌లో బలమైన నేతలను తమ వైపు తిప్పుకోవడానికి పోలీసు కేసులు పెట్టించారని ఆరోపించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు లేవని గతంలో చెప్పినప్పటికీ, అనేక సమస్యలు ఉన్నట్లు ప్రజలు తమ వద్దకు వచ్చి చెప్పుకుంటున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి, సిరిసిల్ల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 30న భారీ బహిరంగ సభకు విచ్చేస్తున్నారని, కాంగ్రెస్ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సూది రాజేందర్, మాజీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, సర్పంచుల పూర్వ అధ్యక్షుడు దొమ్మాటి సరసయ్య, కాంగ్రెస్ నాయకులు చేపురి రాజేశం గుప్తా, బండారి బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, వంగ శ్రీకాంత్ రెడ్డి, మరి శ్రీనివాస్ రెడ్డి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 29) : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశంతో నిర్మల్ పట్టణంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న ఈ మాసోత్సవాల్లో భాగంగా బ్యాంక్ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా ధర్మసాగర్ పరిసర ప్రాంతాలతో పాటు బస్టాండ్ ఆవరణలో భారీ ఎత్తున పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రయోజనార్థం పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో అధికారులంతా స్వయంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. వీధి పరిసరాలు, ప్రజా రవాణా కేంద్రాల వద్ద చెత్తను తొలగిస్తూ పరిసరాల శుభ్రత ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యత అని గుర్తు చేశారు. ప్రతి పౌరుడు తమ ఇల్లు, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా నిర్వాహకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ఎల్డీఎం రాంగోపాల్, టీజీబీ రీజినల్ మేనేజర్ నవీన్‌తో పాటు పలువురు బ్యాంకింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హద్దు దాటితే మహిళలతో కొట్టిస్తాం

▸▸ మొదటిపేజీ తరువాయి

మహిళా కార్యకర్తలు సర్వసన్నద్ధంగా ఉన్నారని ఆమె స్పష్టం చేశారు.
పార్టీలోని ఒక్కో మహిళా నాయకురాలు నలుగురిని కొట్టగలదని, నాయకులు, ప్రత్యర్థులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సురేఖ హెచ్చరించారు. ఇదే సమయంలో పార్టీలోని అంతర్గత విభేదాలపై కూడా ఆమె గట్టిగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులంతా తమ మధ్య ఉన్న విభేదాలు, ముఠా తత్వాలను తక్షణమే పక్కనపెట్టి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా కలిసికట్టుగా ఉంటేనే పార్టీ బలోపేతం అవుతుందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా శ్రమించాలని సూచించారు. ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలను కొండా సురేఖ తీవ్రంగా తప్పుబట్టారు. విపక్ష నాయకులు నిరాధార ఆరోపణలతో కేవలం గాలిలో కత్తులు తిప్పుతున్నారని, వారి విమర్శల్లో ఎలాంటి వాస్తవం లేదని ఎద్దేవా చేశారు. శత్రువులు చేస్తున్న అసత్య ప్రచారాలను, గాలి కత్తులను గట్టిగా తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ కేడర్ సంసిద్ధంగా ఉందని, దేనికీ భయపడే ప్రసక్తే లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు.





నాణ్యతలో రాజీ పడొద్దు

ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం

నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

కలంజ్యోతి, నాగర్ కర్నూల్ (సెప్టెంబర్ 29) : మెడికల్ కాలేజీకి అనుబంధంగా 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.235 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఆసుపత్రి పనులను ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడొద్దని స్పష్టం చేశారు. 550 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి

బీజేపీ రాష్ట్ర నేత రావుల రాంనాథ్

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 29) : ఓటరు సర్వేపై కాంగ్రెస్ నిరసనలు వ్యక్తం చేయటం ద్వారా రెండు నాల్కల ధోరణి అవలంబిస్తోందని బీజేపీ రాష్ట్ర నేత రావుల రాంనాథ్ నిరసన వ్యక్తం చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాల పాలనలో దేశంలో ఎన్నోసార్లు ఓటరు సమగ్ర సర్వేను చేసిన కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ అధికారంలో అదే పని చేస్తే గగ్గోలు చేయటం సరికాదన్నారు. కాంగ్రెస్ గెలిచిన చోట సర్వే బాగా పని చేస్తున్నదని, ఓడిన చోట బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తుందని రెండు నాలుకల ధోరణి వ్యవహరించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. తెలంగాణలో ఎక్కడైనా కాంగ్రెస్ నాయకుల పేర్లు తొలగించారా అని ప్రశ్నించారు. రాజ్యాంగంపై విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాలేమన్న భయంతో బీజేపీని, ప్రధాని నరేంద్ర మోదీని అప్రతిష్టపాలు చేయాలని దేశంలో అలజడి, అల్లర్లు సృష్టించి ప్రజలను అయోమయానికి గురిచేయాలని కుట్రలు చేస్తున్నదన్నారు. ఒక వ్యక్తికి మూడు ఓట్లు ఉండటం, చనిపోయిన వ్యక్తులను తొలగించకుండా కొనసాగించడం సమంజసమా అని నిలదీశారు. అదేవిధంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి వచ్చినటువంటి వలసదారులను ఏరివేయడం తప్పా అని, దీనికి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు సమాధానం చెప్పాలన్నారు. ఇటీవల తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినపుడు ఈసీని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. నిర్మల్‌లో సైతం బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఉండగా నిర్మల్ మున్సిపాలిటీని కైవసం చేసుకున్న కాంగ్రెస్ నేతలు దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారా అన్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని అడిగే కాంగ్రెస్ పార్టీ నిర్మల్ మున్సిపల్ ఎన్నికలను తిరిగి నిర్వహించాలని అడిగే దమ్ముందా అని ప్రశ్నించారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తిక్, కౌన్సిలర్లు గంజి రాజు, జింక సూరి, శ్రీరామోజు నరేష్ పాల్గొన్నారు.



తండ్రిపై కోపంతో ఇంటికి నిప్పు

నిర్మల్ జిల్లా స్వర్ణలో ఘటన

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 29) : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామంలో రఘు అనే యువకుడు తండ్రిపై కోపంతో ఇంటికి నిప్పంటించాడు. తాగిన మైకంలో ఉన్న రఘు తండ్రితో జరిగిన గొడవతో ఇంటికి నిప్పు అంటించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
బుధవారం 30.09.2026
www.kalamjyothi.com

తుమ్మిడిహట్టికి అనుమతులు ఇప్పించండి

▶▶ మొదటిపేజీ తరువాయి

సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం కోరిన సాంకేతిక సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్రల మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. +152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి సులువుగా తరలించేందుకు వీలుంటుందని, తద్వారా నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం భారీగా తగ్గుతుందని వివరించారు.

పాలమూరు, డిండి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులివ్వాలి..

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్‌కు తక్షణమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా పర్యావరణ అనుమతులపై నూతన మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో, ఆయా ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనుమతుల మంజూరులో జరుగుతున్న జాప్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం విపరీతంగా పెరుగుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను కూడా త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇప్పటికే సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాల క్లియరెన్స్ ఇవ్వాలన్నారు. ఈ ప్రాజెక్టుపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్ఓసీ పొందేందుకు తాము చర్చిస్తున్నామని తెలిపారు.

టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటు వేగవంతం చేయాలి..

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో చేపట్టాల్సిన టెలీమెట్రీ యంత్రాల వ్యవస్థను త్వరితగతిన పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటు కోసం అవసరమైన రూ.4.15 కోట్ల నిధులను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే బోర్డు వద్ద జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

మొదటి దశ పనులను సత్వరమే పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టుల పనులకు కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సురక్షిత నల్లా నీరు

మిషన్ భగీరథ ఏఈ ప్రభావతి

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 29) : చెన్నారావుపేట మండల కేంద్రంలోని పాత మగ్గంపురం గ్రామంలో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని నల్లా ద్వారా అందించడమే మిషన్ భగీరథ ప్రధాన ఉద్దేశమని మిషన్ భగీరథ ఏఈ ప్రభావతి అన్నారు. మంగళవారం పాత మగ్గంపురం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని తాగునీటి సరఫరా, నిర్వహణకు సంబంధించిన అంశాలపై వివరించారు. ప్రతి కుటుంబానికి నల్లా ద్వారా నీరు సక్రమంగా అందేలా గ్రామస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సూచించారు. నీటి సరఫరా వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవడంతో పాటు, మిషన్ భగీరథకు సంబంధించిన 8 రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని ఏఈ తెలిపారు. రిజిస్టర్లలో నీటి సరఫరా, నిర్వహణ తదితర వివరాలను క్రమబద్ధంగా నమోదు చేయడం ద్వారా సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రజలకు నిరంతరాయంగా నీరు అందేలా పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్, ఉప సర్పంచ్ అలవాల శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ కుమారి, వార్డు సభ్యులు కొయ్యల స్వప్న, నాంపల్లి సంపత్, కట్టూరి లక్ష్మణాచారి, ధోనికెలా రాజమాత, జన్ను రమేష్, పఠాన్ హసీనా, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



తల్లులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్





కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 29) : అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. 9వ పోషణ మాసంలో భాగంగా 'మన అంగన్‌వాడీ మన బాధ్యత' కింద ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 10 నిమిషాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కూరగాయలు, ఆకుకూరలు, బెల్లం, నువ్వులు, బాలామృతంతో సిద్ధం చేసిన పోషకాహార ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 586 కేంద్రాల పరిధిలో పిల్లలు, గర్భిణులు, బాలింతలు కలిపి మొత్తం 40 వేల మంది సేవలు పొందుతున్నారని తెలిపారు. ప్రతి నెలా తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకెళ్లి ఎత్తు, బరువు నమోదు చేయించి పోషకాహారం అందించాలని సూచించారు. బాలల మొదటి వెయ్యి రోజుల దశ అత్యంత కీలకమని, పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు తల్లిదండ్రుల ఇద్దరి బాధ్యతని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల్లో ఆటలు, పాటల ద్వారా విద్యతో పాటు పోషకాహారం అందుతుందని, సూపర్‌వైజర్లు, సీడీపీఓలు క్రమం తప్పకుండా కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు.

దేశంలో దాదాపు 54 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, రక్తహీనత ఉన్న మహిళలు ప్రతి ఆరు నెలలకోసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్‌సీ పరీక్షలకు వచ్చే గర్భిణులకు భోజనం అందించాలని, మహిళలు ముసగాకు, ఆకుకూరలు, బెల్లం వంటి పోషకాలను నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో శారీరక ఎదుగుదల లోపాలు, మూగ, చెవుడు, మానసిక బుద్ధిమాంద్యం వంటి సమస్యలు గుర్తిస్తే వెంటనే సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఆర్బీఎస్‌కే వాహనం ద్వారా వేములవాడలోని డీఈఐసీ కేంద్రానికి, అవసరమైతే కరీంనగర్, హైదరాబాద్‌లకు తరలించి మెరుగైన ఉచిత వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అఖిల్ బేగం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, తహసీల్దార్ రజని, ఎంపీడీవో సత్తయ్య, సర్పంచ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలకు హిందీ ఉపయుక్తం

ప్రొఫెసర్ సుధాకర్



కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 29) : నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ దివస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ భోజ్రామ్ మాట్లాడుతూ భారతదేశంలో హిందీ భాష జాతీయ భాషగా గుర్తింపు పొందడం వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేశారు. పాఠ్యాంశాల్లో బోధించే కబీర్ దాస్, తులసీదాస్ వంటి కవులు అవధి, బ్రజ్ భాషలలో రచనలు చేసినప్పటికీ, అవి కూడా హిందీ మాండలికాల్లో భాగమేనని వివరించారు. హిందీ భాషా వికాస యాత్రలో ఫోర్ట్ విలియం కాలేజ్ పాత్ర అపారమైనదని, ఖడీ బోలీ కవులు, ఇతర కవుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ హిందీ జాతీయ భాషగా కాకుండా ఉపాధి అవకాశాలలో కూడా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం హిందీ దివస్ పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన మెరోజ్ ఫాతిమా, సాయిరాజ్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా



కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 29) : ప్రభుత్వాసుపత్రులకు వచ్చే ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రిని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన అనంతరం పారిశుధ్య పనులు చేపట్టి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఓపీ, ఐపీ, రోగుల నమోదు, సాధారణ వైద్య సేవలు, ప్రసూతి విభాగం, రక్త పరీక్షల విభాగం, మందుల గదిని పరిశీలించారు.

ఆయా విభాగాల రిజిస్టర్లను తనిఖీ చేసి, ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ విభాగాల్లో ప్రతిరోజూ అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరై రోగులకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోయబ్ హుస్సేన్, వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
బుధవారం 30.09.2026
www.kalamjyothi.com

సీఎం సభకు భారీగా తరలిరావాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 29) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సిరిసిల్లలో నిర్వహించనున్న బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సిరిసిల్లలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, వేముల వీరేశం, విజయరామారావు, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలకు దిగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం నిర్వహించనున్న సభకు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలను పెద్ద సంఖ్యలో తీసుకువచ్చేలా స్థానిక నాయకులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కాళేశ్వరం భూసేకరణ వేగవంతం చేయాలి

నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 29) : కాళేశ్వరం ప్రాజెక్ట్ 27వ ప్యాకేజీకి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) సమీపంలో నిర్మాణంలో ఉన్న కాలువ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. కాలువ నిర్మాణ పనుల పురోగతి, ఆయకట్టు విస్తీర్ణం, సాగునీటితో ప్రయోజనం పొందే మండలాలు, భూసేకరణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత మ్యాపులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు సాగునీరు అందించడంలో కీలకమైన ఈ ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాలువ నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణతో పాటు ఇతర పనులను వేగవంతం చేయాలన్నారు. ఇరిగేషన్ ఈఈ అనిల్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ శ్రీకాంత్, ఇరిగేషన్ ఏఈ గంగాధర్, ఇతర అధికారులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.



సేవా సంకల్ప్‌లో విద్యార్థుల ప్రతిభ

సామాజిక బాధ్యతతో మెలగాలి

బీజేపీ నేత రాణాప్రతాప్‌రెడ్డి



కలంజ్యోతి, నర్సంపేట (సెప్టెంబర్ 29) : సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నర్సంపేట పట్టణంలోని మదర్స్ ల్యాండ్ హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, ప్రసంగ పోటీలు నిర్వహించారు. నరేంద్ర మోదీ - నేటి భారతం అనే అంశంపై విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సేవా సంకల్ప్ అభియాన్ వరంగల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశ అభివృద్ధి, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, అంతరిక్ష రంగం తదితర అంశాలను తమ చిత్రాలు, ప్రసంగాల ద్వారా వివరించారు. డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, దేశం పట్ల అవగాహన కలిగి సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పాశికంటి రమేష్, పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్ గౌడ్, సీనియర్ నాయకులు వల్లే పర్వతాలు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంకిసా విఘ్నేష్‌గౌడ్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు విజయ్ సింగ్, నాగేంద్ర బాబు, ముత్యాల శ్రీనివాస్, పోనుగోటి రవీంద్రాచారి, చేను నరేష్, అజీమ్ పాషా, రాజు, కొండ్రా తరుణ్‌సాయి, సంగెపు తేజ, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అశ్వినీ ఆసుపత్రిలో వరల్డ్ హార్ట్ డే

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 29) : వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఎల్లారెడ్డిపేటలోని అశ్వినీ హాస్పిటల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వినీ హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి. సత్యనారాయణ స్వామి, మేనేజింగ్ డైరెక్టర్ అభినయ్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండె సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో అశ్వినీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ రహిత గ్రామమే లక్ష్యం

స్టీల్ వాడకాన్ని పెంచాలి

నస్తీపూర్ సర్పంచ్ ప్రమీల



కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 29) : గ్రామ ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకునేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నస్తీపూర్ సర్పంచ్ ప్రమీల సాయిలు, ఉప సర్పంచ్ మహేందర్ పటేల్ సూచించారు. మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామ పంచాయతీలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వాడే ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో స్టీల్ గ్లాసులు, వాటర్ బాటిళ్లను ఏర్పాటు చేశారు. మంచి పద్ధతి పంచాయతీతోనే మొదలై ఊరంతా స్టీల్ వాడకాన్ని పెంచాలనే సంకల్పంతో గ్రామస్థులంతా కలిసికట్టుగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదయ్య, వార్డు సభ్యులు కళ్యాణ్ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, వాలంటీర్ ప్రవళిక, యాదయ్య, స్వామి పటేల్, రమేష్, ప్రవీణ్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎం సభకు కాంగ్రెస్ శ్రేణులు రండి

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ముషికం దత్తాద్రిగౌడ్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 29) : సిరిసిల్లకు సీఎం రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముషికం దత్తాద్రి గౌడ్ కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరే పథకాలు ప్రవేశపెట్టబడ్డాయని తెలిపారు. ప్రజాభివృద్ధి, సంక్షేమంతో పాటు రైతులు, యువకులు, పారిశ్రామిక రంగం, మహిళలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాల వారితో పాటు రాష్ట్రంలో అన్ని విధాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. లక్ష మందితో నిర్వహించతలపెట్టిన సీఎం సభకు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

బుధవారం 30.09.2026

www.kalamjyothi.com



శిల్పి వెంకటరమణాచారికి ప్రతిభా పురస్కారం

జిల్లాకే గర్వకారణం: కవుల ప్రశంసా

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 29) : తెలంగాణ తల్లి రూపశిల్పి, నిర్మల్‌లోని వెంకటాద్రిపేటకు చెందిన బైరోజు వెంకటరమణ చారికి జిల్లా కవులు అభినందనలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల 2025 సంపత్సరానికి గాను 12 మంది కవులు, కళాకారులు, రచయితల విభాగాలలో చారికి ప్రతిభా పురస్కారాన్ని ప్రకటించగా, ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ సినీ నటుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు మురళీమోహన్ చేతుల మీదుగా హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలుగు యూనివర్సిటీ ఆధ్వర్యంలో పురస్కారంతో పాటు నగదు అందజేశారు. వెంకటరమణ చారికి పురస్కారం రావడం నిర్మల్ జిల్లాకే గర్వకారణమని కవులు, రచయితలు కొనియాడారు. ఆయన కేవలం శిల్పకళలోనే కాకుండా చిత్రలేఖనం, కవిత్వంలో కూడా రాణిస్తున్నందుకు కవులు పత్తి శివప్రసాద్, నేరెళ్ల హనుమంతు, పోలీస్ భీమేష్, వెన్నెల రాజేందర్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.



సమాచార కమిషనర్లకు ఆహ్వాన పత్రాలు



కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 29) : సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 7న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న ఆర్టీఐ చట్టం ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సుకు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్లను ఆహ్వానించారు. కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయాన్ని సందర్శించి రాష్ట్ర సమాచార కమిషనర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. అక్టోబర్ 7న నిర్వహించనున్న కార్యక్రమం ఉద్దేశాలు, ప్రణాళిక, ప్రజల్లో ఆర్టీఐపై అవగాహన పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్, పి.వి. శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, బోరెడ్డి అయోధ్య రెడ్డి, మెర్ల వైష్ణవిలను కలిసి అధికారిక ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఆర్టీఐ ద్వారా ప్రజలకు తమ సమాచార హక్కుపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం, ప్రజలు చట్టబద్ధంగా హక్కులు వినియోగించుకునేలా చేయడమే సదస్సు ప్రధాన ఉద్దేశమని ప్రతినిధులు తెలిపారు. సదస్సులో జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, నియోజకవర్గ, గ్రామ స్థాయి ప్రతినిధులు, ఆర్టీఐ కార్యకర్తలు, విద్యావేత్తలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి రావుల నవీన్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎ. శ్రీకాంత్ రెడ్డి, విజయ్ రామ్ సింగ్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి షాదుల్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీఐ కమిటీని బలోపేతం చేస్తాం

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ
జాతీయ చైర్మన్ డాక్టర్ చంటిముదిరాజ్

కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 29) : ప్రజల హక్కుల పరిరక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమాచార హక్కు చట్టాన్ని మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గం నిర్ణయించింది. కమిటీ అధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బీఎన్ రెడ్డి నగర్‌లోని ద్వారకా కన్వెన్షన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతంగా జరిగింది. జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంస్థ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, జిల్లాల వారీగా ప్రజా సమస్యలపై కార్యాచరణ, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వివిధ జిల్లాల ప్రతినిధులు తమ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, అధికారుల నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ప్రజా సమస్యలను కేవలం ప్రస్తావించడం కాకుండా ఆధారాలను సేకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అవసరమైన సందర్భాల్లో అధికారిక ప్రాతినిధ్యాలు, ఫిర్యాదులు చేయడం, చట్టపరమైన మార్గాలను అనుసరించడం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కమిటీ కార్యకలాపాలను విస్తరించి, మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. సమావేశాన్ని విజయవంతం చేసిన జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి బాధ్యులకు జాతీయ చైర్మన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ ఉపాధ్యక్షుడు గోపీనాథ్ కట్టెకోలా, జాతీయ సహాయ కార్యదర్శులు అన్నవరం సందీప్ రెడ్డి, వంగల వివేకానందు, రాష్ట్ర కార్యదర్శులు రావుల నవీన్ కుమార్, వేణుగోపాల్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, అశోక్ కుమార్, కాశి సతీష్ కుమార్, గడప కృష్ణ, అరవింద స్వామి, కార్తీక్ రెడ్డి, బాపయ్య, విజయ్ రామ్ సింగ్, వంశీకృష్ణ, రఘు, రమేష్, 33 జిల్లాల ఆర్టీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాల్లో నిర్లక్ష్యం తగదు

ఎంపీడీవో వెంకటశివానంద్



కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 29) : వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చెన్నారావుపేట ఎంపీడీవో వెంకటశివానంద్ మంగళవారం మండల కేంద్రంలోని దుగ్గొండి సోషల్ వెల్ఫేర్ సాంఘిక సంక్షేమ నివాస పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అందుతున్న సదుపాయాలు, పాఠశాల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, తాగునీటి వసతి, విద్యార్థుల డార్మిటరీల పరిస్థితిని పరిశీలించి పారిశుధ్య ప్రమాణాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసి అక్కడ నిల్వ ఉన్న సరుకుల నాణ్యత, నిల్వ విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందుతున్నదా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే పాఠశాలకు సంబంధించిన రికార్డులు, నిర్వహణ రిజిస్టర్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి అందాల్సిన సదుపాయాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీవో సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ సెంటర్‌పై నిర్లక్ష్యం

బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 29) : నిర్మల్ జిల్లా కేంద్రంలో మోదీ ప్రభుత్వం మంజూరు చేసిన క్రిటికల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించకుండా కాలయాపన చేస్తూ ప్రజారోగ్యంతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.23.74 కోట్ల భారీ నిధులతో నిర్మల్‌కు అత్యాధునిక క్రిటికల్ కేర్ సెంటర్‌ను మంజూరు చేసిందన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత, స్థానిక శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చొరవతో ఈ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ, రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇంకా సుమారు రూ.10 కోట్ల విలువ చేసే ఫర్నిచర్, అత్యవసర వైద్య పరికరాలను సమకూర్చలేదని మండిపడ్డారు. ప్రారంభోత్సవ తేదీ నిర్ణయించడానికి మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వంలో లేరని, అధికారం మొత్తం కాంగ్రెస్ చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి నలుగురిని వెంటబెట్టుకుని వచ్చి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిపై అసత్య నిందలు వేస్తూ చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి సూచించారు. తప్పుడు కూతలు కూసే బదులు చేతనైతే ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు చిల్లర ప్రచారాలు మాని కేంద్ర నిధులతో పరికరాలు, ఫర్నిచర్ సమకూర్చి, యుద్ధప్రాతిపదికన క్రిటికల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
6
బుధవారం 30.09.2026
www.kalamjyothi.com



సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

1,600 మందితో భారీ బందోబస్తు
ఎస్పీ మహేష్ బి.గితే

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 29) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసింది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సుమారు 1,600 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. పర్యటన బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందితో మంగళవారం కళ్యాణలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించిన ఎస్పీ.. భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణపై సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, డ్యూటీ పాయింట్ల వద్ద అప్రమత్తత తదితర అంశాలపై సూచనలు చేశారు. బందోబస్తును 12 సెక్టార్లుగా విభజించి పోలీసులను నియమించినట్లు ఎస్పీ తెలిపారు. కేటాయించిన డ్యూటీ పాయింట్లలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ బందోబస్తులో 2 అదనపు ఎస్పీలు, 15 మంది డీఎస్పీలు, 50 మంది సీఐ/ఆర్ఐలు, 148 మంది ఎస్ఐ/ఆర్ఎస్ఐలు, 328 మంది ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు, 482 మంది కానిస్టేబుళ్లు, 121 మంది మహిళా సిబ్బంది, 196 మంది హోంగార్డులు, 60 మంది బెటాలియన్ సిబ్బంది, 190 మంది డిస్ట్రిక్ట్ గార్డ్స్ సహా మొత్తం సుమారు 1,600 మంది పాల్గొంటున్నారు. సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డుల్లో పారదర్శకత పాటించాలి

జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
భూముల అవకతవకలపై కమిటీ సమీక్ష

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 29) : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు భూముల అవకతవకలపై నియమించిన కమిటీ సభ్యుడు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో సమీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో పాటు జిల్లాలోని తహసీల్దార్లతో సమావేశమై భూములకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 134కు అనుగుణంగా జిల్లాలో భూములకు సంబంధించిన రికార్డులు, అవకతవకలు, వివాదాస్పద అంశాలు తదితర విషయాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. భూముల విషయంలో ఏవైనా అక్రమాలు, అవకతవకలు గుర్తించినట్లయితే వాటిపై నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భూముల వ్యవహారాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రికార్డులను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార పంపిణీపై పర్యవేక్షణ ఉండాలి

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 29) : ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల అర్గనైజేషన్ నాయకులు కోరారు. క్షేత్రస్థాయి తనిఖీలు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సందేహాలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో వెంకట శివానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, అర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి విజయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు గడ్డం సుభద్ర మాట్లాడుతూ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా మధ్యాహ్న భోజన సమయంలోనే ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. భోజనాన్ని, పౌష్టికాహారాన్ని అధికారులు స్వయంగా పరిశీలిస్తేనే నాణ్యత తెలుస్తుందన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు సమన్వయంతో వారానికి కనీసం ఒకరోజైనా తనిఖీలు నిర్వహించాలని, తద్వారా సిబ్బందిలో జవాబుదారీతనం పెరుగుతుందని తెలిపారు.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

మంత్రికి జర్నలిస్టుల వినతి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 29) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నాలుగు దశాబ్దాలుగా జర్నలిస్టులుగా సేవలందిస్తున్న తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మండల జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో వివిధ పత్రికలు, న్యూస్ ఛానళ్లలో పనిచేస్తున్న పాత్రికేయులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ తమ వృత్తిని కొనసాగిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు సొంత నివాస స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. నాలుగు దశాబ్దాలుగా జర్నలిజాన్ని నమ్ముకుని ప్రజలకు సేవ చేస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి స్థలం లేకపోవడం బాధాకరమని, ప్రస్తుత ప్రభుత్వం స్పందించి అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. జర్నలిస్టుల వినతిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి, ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జర్నలిస్టులు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన వివిధ పత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.



భూగర్భ జలాల పెంపే లక్ష్యం

ఎంపీడీవో వెంకట శివానంద్

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 29) : చెన్నారావుపేట మండలంలోని జీడిగడ్డ తండాలో మ్యాజిక్ ఇంకుడు గుంతల నిర్మాణానికి అనువైన స్థలాల గుర్తింపునకు అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. మండల ఎంపీడీవో వెంకట శివానంద్ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి తండాలోని వివిధ వీధుల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ఇళ్ల నుంచి వెలువడే బూడిద నీరు, వ్యర్థ జలాలు రోడ్లపైకి చేరకుండా వాటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మురుగునీరు ఎక్కువగా నిలిచే ప్రాంతాలను గుర్తించి అనువైన ప్రదేశాలను మార్కింగ్ చేశారు. ఇంకుడు గుంతల నిర్మాణంతో మురుగునీటి సమస్య తగ్గడంతో పాటు పరిసరాల పరిశుభ్రత మెరుగుపడుతుందని, దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, భూగర్భ జలమట్టం పెంపునకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన జీవనానికి వ్యర్థ నీటిని సక్రమంగా నిర్వహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. జీడిగడ్డ తండాను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి గ్రామస్థులను కోరారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక



సంతృప్తినిచ్చే పాత్రలే అసలైన విజయం

బాక్సాఫీస్ రికార్డులు, భారీ కలెక్షన్ల కంటే నటిగా తనకు సంతృప్తినిచ్చే పాత్రలు చేయడమే అసలైన విజయమని ప్రముఖ నటి శోభిత ధూళిపాళ్ల స్పష్టం చేశారు. నటనపై మక్కువతో 16 ఏళ్ల వయసులోనే వైజాగ్ వదిలి ఇండస్ట్రీకి వచ్చానని, ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహమే ఈ స్థాయికి తెచ్చిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మనసుకు నచ్చిన దారిలో ముందుకు సాగాలని పేర్కొన్న ఆమె, వసూళ్ల కంటే పాత్ర ప్రాధాన్యతకే తాను ప్రా-ముఖ్యమిస్తానని వివరించారు.